ఈనాడు
కుమురం భీం
మంగళవారం సెప్టెంబరు 1, 2026

ఆసిఫాబాద్ పట్టణం సందీప్‌నగర్‌కు చెందిన సంతోష్ స్థానిక ఓ రేషన్ దుకాణంలో కార్డు కలిగి ఉన్నారు. ఇదివరకు వివిధ దుకాణాల్లో బియ్యం తీసుకెళ్లేవాడు. మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ చేయడంతో.. పట్టణంలో పది రోజులుగా పలు దుకాణాలతోపాటు పక్క గ్రామాలు తిరిగినా స్టాక్ లేదని తిప్పి పంపారని వాపోయాడు. సోమవారం జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో అధికారికి సమస్య విన్నవించాడు. స్పందించిన అధికారి.. అడ గ్రామ డీలర్‌కు ఫోన్‌చేసి చెప్పడంతో.. అక్కడికి వెళ్లి తెచ్చుకున్నాడు.

ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన ఒకేసారి ఇవ్వడంతో.. చాలా మంది దుకాణాల వద్ద బారులు తీరాల్సి వచ్చింది. కొన్నిచోట్ల డీలర్లు స్టాక్ రాలేదంటూ తిప్పి పంపిన సందర్భాలున్నాయి. చివరికి కొందరు తీసుకోకుండా నష్టపోవాల్సి వచ్చింది. కుటుంబంలో అయిదారుగురు సభ్యులున్న వారు తీసుకెళ్లడంలోనూ ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో మొత్తం 315 దుకాణాల పరిధిలో 1,65,542 కార్డులు ఉన్నాయి. వీటిలో 1,49,598 మంది కార్డుదారులే బియ్యం తీసుకున్నారు.

పది శాతం.. మూడు నెలల బియ్యానికి దూరం

● సరఫరాలో జాప్యంతో లబ్ధిదారులకు నష్టం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న బియ్యానికి చాలా మంది దూరమయ్యారు. ఎంఎల్ఎస్ గోదాంల నుంచి దుకాణాలకు విడతల వారీగా సరఫరా చేయడం, స్టాక్ లేకపోవడంతో కొందరు కార్డుదారులకు బియ్యం లభించని పరిస్థితి. సోమవారం పంపిణీకి చివరి రోజు కాగా.. గణాంకాలను బట్టి జిల్లాలో 15,944 మంది (పది శాతం) కార్డుదారులు మూడు నెలల కోటా బియ్యం తీసుకోలేదు.

● ప్రాంతంతో సంబంధం లేకుండా కార్డుదారులు బియ్యాన్ని ఎక్కడి రేషన్ దుకాణం నుంచైనా తీసుకునే పోర్టబులిటీ విధానం అమల్లో ఉంది. జిల్లాలో దీని అమలు సక్రమంగా జరగడంలేదు.

● జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ పుర పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి చాలా మంది వచ్చి నివసిస్తున్నారు. వీరు అందుబాటులో ఉన్న దుకాణాల నుంచి బియ్యం తీసుకెళ్తున్నారు.

● ఒక దుకాణంలోని కార్డుదారులు పోర్టబులిటీ విధానం ద్వారా మరో దుకాణం నుంచి తీసుకున్నప్పుడు.. డీలర్ కోరితే అంతే పరిమాణంలో అదనపు కోటా కేటాయించాలి.

● ఇదివరకు జిల్లా కేంద్రంలోని డీలర్లు తమ కోటా పంపిణీ పూర్తయితే.. అదనపు కోటా కోసం రిక్వెస్టు పెడితే అధికారులు ఆమోదించేవారు. ఆరు నెలలుగా ఈ విధానాన్ని నిలిపివేశారు. డీలర్లు మాత్రం ఏ కార్డుదారు వచ్చినా బియ్యాన్ని ఇస్తున్నారు. అధికారులు వారికి అదనపు కోటా ఇవ్వకపోవడంతో.. ఆలస్యంగా వచ్చేవారికి బియ్యం దొరకక గొడవలకు దిగుతున్నట్లు వాపోతున్నారు.

జిల్లాలో రేషన్ దుకాణాలు	మొత్తం కార్డులు	బియ్యం తీసుకెళ్లిన వారు
315	1,65,542	1,49,598

ఈటీవీ-ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో పంటలకు వినియోగించే జీవ రసాయనాల(బయోమందుల) విక్రయం పేరిట రూ.కోట్ల అక్రమ దందా దర్జాగా నడుస్తోంది. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని రసాయన మందులతోనే గుర్తుపట్టనట్లుగా కొంత మార్పిడి చేసి జీవ/సేంద్రియ మందులని నమ్మించి విక్రయించే ప్రయత్నం జరుగుతోంది.

బయో పేరిట మాయోపాయం

● దర్జాగా అక్రమ దందా

ఆదిలాబాద్, ఉట్నూరు, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, భైంసా, మంచిర్యాల, జైపూర్, చెన్నూరు, లక్సెట్టిపేట, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, జైనూర్ కేంద్రాలుగా విచ్చలవిడిగా జరుగుతున్న నకిలీ రసాయనాల అమ్మకాల వెనక కొన్ని కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, మరికొంతమంది వ్యాపారులతో కలిసి ఏర్పడిన ముఠాల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

☛ నిబంధనల ప్రకారమైతే తెలంగాణ ఎరువుల నియంత్రణ పరిధిలోకి వచ్చిన బయో ఫర్టిలైజర్ చట్టానికి లోబడి జీవ రసాయనాలను విక్రయించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి తీసుకోవాల్సి ఉంది.

☛ తయారు చేసిన కంపెనీల వివరాలు, వాటి వినియోగంతో నేల విషపూరితం కాదనీ, మనుషులు, ఇతర జంతుజాలానికి ప్రమాదం లేదని నిరూపించేలా వ్యవసాయ విశ్వవిద్యాలయాల ల్యాబ్‌ల నివేదికలను అందుబాటులో ఉండాలి.

☛ ఇవేం లేకుండానే కొంతమంది వ్యాపారులు, కంపెనీల ప్రతినిధులు కలిసి మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ నుంచి తెచ్చే మందులతోపాటు స్థానికంగానే తయారు చేసేవి మరికొన్నింటి కలిపి రైతులకు విక్రయించే దందా నడుస్తోంది.

● రెండు నెలల కిందట ఆదిలాబాద్‌లో ఓ వ్యక్తి నకిలీ బీటీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి సమీపంలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని గోదాంలో తనిఖీ చేశారు. నకిలీవిత్తనాలతో పాటు అనుమతి లేని జీవరసాయన ఎరువులు ఉన్నట్లు తేలింది.

కరవైన నిఘా

● నకిలీ విత్తనాలు విక్రయించిన ప్రతి ఒక్కరికీ నకిలీ జీవ రసాయనాలతో సంబంధం ఉన్నట్లు పోలీసుల దృష్టికి వెళ్లింది.

● టాస్క్‌ఫోర్స్ కమిటీల తనిఖీలు నామమాత్రం కావటంతో ఆశించిన ప్రగతి కనిపించటం లేదు. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ దుకాణాల్లో రోజూ రూ.లక్షల్లో జీవ రసాయన వ్యాపారం సాగుతోంది. 'మామూలు'గా తీసుకుంటున్న వ్యవసాయ శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

● ఈ బయో ఎరువులు వాడగానే రెండు, మూడు రోజుల పాటు మొక్క ఆకుపచ్చగా కనిపిస్తుంది. కాండం పెరిగినట్లు అనిపిస్తుంది. ఆ తర్వాత మళ్లీ యథావిధిగానే ఉంటుంది.

కావాల్సిన టిక్కర్స్

బయో మందుల సీసాలపై దుకాణదారులు కావాల్సిన పేరుతో టిక్కర్స్(లేబుల్స్)ను అతికించి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.300కు తయారు చేసే ఒక లీటర్ సీసాను ఏకంగా రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. దీని వెనక అక్రమార్కుల ఎత్తుగడ ఎలా ఉందో వెల్లడవుతోంది. మరి కొంతమంది ఆన్‌లైన్‌లో రూ 15 వేల నుంచి రూ.20 వేల వరకు ప్రభుత్వ అనుమతి ఉందంటూ వెల్లడించేలా నకిలీ ల్యాబ్ పత్రాలు కొనుగోళ్లు చేసుకుంటున్నట్లు తెలిసింది.

బతుకు పోరాటంలో.. బాల్యం

చేతిలో పుస్తకాలు పట్టుకుని తరగతి గదిలో ఉండాల్సిన ఓ బాలుడు.. పొట్టకూటి కోసం మేకలు కాస్తూ కనిపించిన దృశ్యమిది. వాంకిడి మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులో ఓ బాలుడు కాపరిగా మేకలు కాస్తున్నాడు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం బడులను తీర్చిదిద్దుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. తల్లిదండ్రుల అవగాహన లోపం, కుటుంబ పరిస్థితులు, నిర్లక్ష్యం వెరసి.. చిన్నారుల బాల్యం బతుకు పోరాటంలో బందీగా మారుతోంది. ఇటువంటి వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - **న్యూస్‌టుడే, వాంకిడి**

మొరం తవ్వకాలు.. కరుగుతున్న గుట్టలు

వాంకిడి, న్యూస్‌టుడే

సహజ వనరులకు ఆలవాలమైన జిల్లాలో పలువురు అక్రమార్కులు.. నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ భూములు, గుట్టలను గుట్టు చప్పుడు కాకుండా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరి కంటా పడకుండా రాత్రివేళల్లో దందాను కొనసాగిస్తున్నారు.. చీకటి పడగానే జేసీబీలతో గుట్టలను తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. స్పష్టంగా నిబంధనల ఉల్లంఘటన జరుగుతున్నప్పటికీ.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ఎత్తయిన గుట్టలు కనుమరుగవుతూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.

వాంకిడి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న గుట్ట ప్రాంతాల్లో మొరం కోసం అక్రమంగా తవ్వకాలు చేపట్టారు. దీంతో ఇక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.

● వాంకిడి మండలంలోని బెండార, బోడగుట్ట, లక్ష్మీపూర్ గ్రామాలకు కిలోమీటరు దూరంలో ఉన్న గుట్టలతోపాటు సోనాపూర్ పంచాయతీ పరిధిలోని రాజులగూడ, ఇంధాని, సరాండి, పరిసర ప్రాంతాల్లోని వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. అక్రమార్కులు వీటినే లక్ష్యంగా చేసుకున్నారు.

● భారీ యంత్రాలతో నిరంతరం తవ్వకాలు జరుపుతుండటంతో.. గుట్టలు రోజు రోజుకూ తరిగిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘన

● నిబంధనల ప్రకారం.. మొరం తవ్వకాలు జరపాలంటే తొలుత మైనింగ్ శాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వారు ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం)కి తహసీల్దార్‌కు పంపుతారు. తర్వాత సంయుక్త సర్వే చేస్తారు. అనంతరం తవ్వకాల ప్రణాళిక, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఇవన్నీ వచ్చాక తగినంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత జిల్లా మైనింగ్ అధికారి క్వారీ తవ్వకాలకు అనుమతులు ఇస్తారు.

● జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా యథేచ్ఛగా మొరం తరలిస్తుండటంతో.. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. అక్రమంగా తరలించిన మొరాన్ని ప్రధానంగా రహదారుల నిర్మాణాలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లలో ప్లాట్లను చదును చేసేందుకు అధిక ధరలకు విక్రయిస్తూ రూ.లక్షల్లో గడిస్తున్నారు.

● అక్రమార్కులకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో.. అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

● ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ పోలీసు శాఖల అధికారులు స్పందించి రాత్రివేళల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి, అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

☛ జిల్లా మైనింగ్ అధికారిని న్యూస్‌టుడే వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ యువరాజ్, డీఈఓ సచ్చిదానందచారిలతో కలిసి ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్‌పీలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలోని 627 పాఠశాలల్లో 1-5 తరగతి విద్యార్థులకు అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చాలా పాఠశాలల్లో విద్యార్థుల శాతం తక్కువగా ఉంటోందని, అధికారులు తల్లిదండ్రులతో మాట్లాడి వారిని రప్పించేలా చూడాలన్నారు. అకడమిక్ క్వాలిటీ అధికారులు శ్రీనివాస్, ఆబీద్ అలీ తదితరులున్నారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరిత, చిత్రంలో అధికారులు

విముక్త జాతుల సంక్షేమానికి చర్యలు

ఆసిఫాబాద్: జిల్లాలో విముక్త జాతుల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విముక్త జాతుల దినోత్సవంలో అదనపు కలెక్టర్లు యువరాజ్, డేవిడ్, డీఆర్వో వేణులతో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఆ జాతులు అన్ని విధాల అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. వారికి గౌరవప్రదమైన జీవనం అందించేలా సమష్టిగా కృషి చేద్దామని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నదీమ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, విముక్త జాతుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతేరాజు 6లో

పకడ్బందీగా ఎఫ్ఎల్ఎన్ అమలు చేయాలి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పునాది(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడం ద్వారా ప్రాథమిక దశలోనే విద్యార్థులకు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం వచ్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జన్కాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పుస్తక పఠనం చేయించారు. రాయడం, సంఖ్యా పరిజ్ఞానం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయులు చేపడుతున్న వినూత్న బోధనా పద్ధతులు, టీఎల్ఎం వినియోగం, తదితర అంశాలను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయురాలు ఉమాబాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థితో పాఠం చదివిస్తున్న అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్‌గా హర్ష్ చౌదరి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్‌గా హర్ష్ చౌదరీని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన హర్ష్‌ను శిక్షణ అనంతరం సబ్‌కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేస్తున్న చేపూరి కృష్ణయ్య సబ్‌కలెక్టర్ బాధ్యతల స్వీకరణ అనంతరం బదిలీపై వెళ్లనున్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న బెల్లంపల్లి ఏరియా డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు

జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: గోలేటి సింగరేణి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారు. 9, 8వ తరగతులు చదువుతున్న హరీశ్, చరణ్‌లు.. ఈ నెల 6-10 తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లో జరగనున్న 29వ సబ్ జూనియర్ జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక కాగా, వారిని సోమవారం జీఎం కార్యాలయంలో డీజీఎం(పర్సనల్), పాఠశాల కరస్పాండెంట్ డి.కిరణ్‌బాబు, డీజీఎం(ఐఈ) ఉజ్వల్‌కుమార్ బెహరాలు అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ పీవో ఎం.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, పీఈటీ భాస్కర్, నరేష్ పాల్గొన్నారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం

● అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు కనెక్షన్లు

రెబ్బెన, న్యూస్‌టుడే

ఏటా వేసవిలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అంగన్‌వాడీ కేంద్ర లబ్ధిదారులు ఇక నుంచి ఉపశమనం పొందనున్నారు. జిల్లాలో విద్యుత్తు సౌకర్యం లేని కేంద్రాలను ఇదివరకే గుర్తించగా.. అన్నిచోట్లా సదుపాయం కల్పించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈమేరకు ఎన్పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. కేంద్రాల్లో వంద శాతం ఉచిత కనెక్షన్లు అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

● జిల్లాలో ఆసిఫాబాద్, జైనూర్, వాంకిడి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,006 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో కొన్నింటికి కొన్నేళ్లుగా విద్యుత్తు సౌకర్యం లేక లబ్ధిదారులు అసౌకర్యానికి గురవుతున్నారు.

● ఓవైపు కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అద్దె, పక్కా, ఇతర ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటు చేసిన వాటిల్లో సౌకర్యాలు కరవయ్యాయి. పలుచోట్ల ఇచ్చిన టీవీలు విద్యుత్తు లేక నిరుపయోగంగా మారాయి.

● కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలంటూ ఇటీవల జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగా.. సర్వే చేసి నివేదికలను అందించారు.

● ఎన్పీడీసీఎల్ సంస్థ కార్యాచరణ రూపొందించి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంది. దీంతో కేంద్రాల్లో విద్యుత్తు దీపాలు వెలిగి, ఫ్యాన్లు తిరగనున్నాయి. టీవీలు కూడా నడిపించే అవకాశం ఉండటంతో.. ఇవి చిన్నారులకు ఎంతగానో ఉపయోగకరంగా మారనున్నాయి.

● నీటి సదుపాయం ఉన్న కొన్ని కేంద్రాలకు సరఫరా సమస్య తలెత్తుతోంది. ప్రస్తుత విధానం ద్వారా అటువంటి చోట్ల విద్యుత్తు మోటారు వినియోగానికి కూడా అవకాశం కల్పించారు.

జిల్లాలో వివరాలిలా..

- ప్రాజెక్టులు - 05
- అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నవి - 352
- అద్దె భవనాలు - 283
- ఉచితంగా కొనసాగుతున్న కేంద్రాలు - 371
- కొత్తగా విద్యుతు కనెక్షన్లు ఇచ్చినవి - 879
- చిన్నారులు - 39,153
- గర్భిణులు - 4,884
- బాలింతలు - 2,830

విద్యుత్తు కనెక్షన్ ఇచ్చిన గోలేటి ఎన్టీఆర్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

879 కేంద్రాలకు..

జిల్లాలోని 1,006 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను ఇప్పటికే కొన్నింటికి విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. మిగిలిన 879 కేంద్రాలకు కనెక్షన్లు అందించి వందశాతం పూర్తి చేసినట్లు జిల్లా విద్యుత్తుశాఖ ఎస్ఈ ఉత్తమ్ జాడె తెలిపారు. ఇంకా కనెక్షన్లు లేకుండా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటికి కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

ప్లకార్డులతో ర్యాలీగా వస్తున్న భారాస కౌన్సిలర్లు

సమస్యల పరిష్కారానికి భారాస నిరసన ర్యాలీ

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోరుతూ.. సోమవారం భారాస కౌన్సిలర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. వివిధ సమస్యలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు చేరుకున్నారు. పట్టణంలో మూడు నెలలుగా వీధిదీపాలు లేక వార్డుల్లో అంధకారం నెలకొందన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో జ్వరాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేపట్టకపోవడంతో వీధులన్నీ దుర్గంధం నెలకొన్నాయని తెలిపారు. వైస్‌ఛైర్‌పర్సన్ డా.కొత్తపల్లి అనిత, కౌన్సిలర్లు వనమాల రాము, వలీ, పెందోర్ మాణిక్యరావు, వసీం, సీపీ విద్యావతి, స్వప్న, బాబురావు, పోచయ్య తదితరులున్నారు.

బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని జిల్లా సంక్షేమ అధికారి స్వరూపరాణి పేర్కొన్నారు. సోమవారం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన గోడ ప్రతులను.. జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, ఇతర సిబ్బందితో కలసి ఆవిష్కరించారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు ఎవరికి తెలిసినా.. వెంటనే అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ నం.1098 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. డీసీపీయూ కౌన్సిలర్ చంద్రశేఖర్, స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని సత్తా చాటాలని ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 160 మంది అభ్యర్థులకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు నెలల పాటు ఇతర ఆలోచనలు చేయకుండా పట్టుదలతో సాగాలన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ నితికా పంత్, చిత్రంలో డీఎస్పీ అశోక్, తదితరులు

జిల్లాలో 30 పోలీస్ యాక్టు అమలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : శాంతి భద్రతల రక్షణ దృష్ట్యా జిల్లాలో ఈ నెల 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిషేధిత ఆయుధాలు, నేరాలకు ప్రేరేపించే వస్తువులు కలిగి ఉండరాదని పేర్కొన్నారు. ఏదేని కార్యక్రమం చేపట్టాలంటే డీఎస్పీ, ఆపై స్థాయి అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు.

అనాథ చిన్నారులకు.. వాత్సల్యం

వాంకిడి, న్యూస్‌టుడే

తల్లిదండ్రుల సంరక్షణలేని, సంరక్షణ అవసరమైన పిల్లలకు రక్షణ, పునరావాసం, భద్రత, విద్య, ఆరోగ్యం, సురక్షితమైన కుటుంబ వాతావరణం కల్పించేందుకు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టాయి. అనాథ పిల్లలకు సంరక్షణకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ.4 వేల ఆర్థిక సాయం అందుతోంది. పిల్లలను సురక్షిత వాతావరణ కల్పించడంతోపాటు వారి విద్య, ఆరోగ్యం, పోషణ, మానసిక వికాసం, పునరావాసంపై అధికారులు దృష్టిసారిస్తారు. గతంలో దీన్ని జిల్లా బాలల పరిరక్షణ విభాగం పరిరక్షించేది. ఈ పథకంలో కొన్ని మార్పులు చేసి మిషన్ వాత్సల్యగా నామకరణం చేశారు. ఈ పథకం అనాథ చిన్నారులకు మంచి భవిష్యత్తును అందించడమే ప్రధాన ఉద్దేశం.

అర్హులు ఎవరంటే?

తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు లేనివారు అర్హులు. పిల్లలకు 18ఏళ్లు నిండరాదు. బాలకార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిల్లలు, వేధింపులు, నిర్లక్ష్యం, దోపిడీకి గురైన చిన్నారులు అర్హులు.

అవసరమైన ధ్రువపత్రాలు

పిల్లల జనన ధ్రువపత్రం, తల్లిదండ్రుల మరణ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయ ధ్రువపత్రం (గ్రామీణులకు రూ.72 వేలు, పట్టణవాసులకు రూ.90 వేల లోపు వార్షిక ఆదాయం). పాస్‌పోర్టు సైజు ఫొటోలు అవసరం.

దరఖాస్తు చేసే విధానం

పథకానికి అర్హులైన వారు జిల్లా మహిళాభివృద్ధి సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు అందించాలి. పిల్లల వివరాలు నమోదు చేయాలి. పేరు వయసు, సంరక్షకుల వివరాలు, కుటుంబ పరిస్థితులు, తదితర వివరాలను ఫారంలో నింపాలి. అవసరమైన పత్రాలు జత చేయాలి. సామాజిక కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వివరాలు సేకరిస్తారు. సీనియారిటీ ఆధారంగా దరఖాస్తు ప్రగతి ఉంటుంది. అన్ని ప్రక్రియలు నిర్ధారణ అయిన తర్వాత నిబంధనల ప్రకారం ఆర్థిక సాయం అందుతుందని మహిళాశిశు సంక్షేమశాఖ వాంకిడి ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు.

11వ వర్ధంతి
మీరు మా నుండి భౌతికంగా దూరమై 11 సంవత్సరాలు గడిచినా మీ జ్ఞాపకాలు మరిచిపోలేనివి. మీ శ్రమించేతత్వం, మంచితనం, సేవాధృక్పథం, ముందుచూపు... మీ రూపం మా హృదయంలో చిరస్మరణీయం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ పి.గంగారెడ్డి గారు
LIC Agent (CLIA)
జననం: 01-03-1959 మరణం: 01-09-2015
సదా మీ స్మృతులతో...
భార్య: పి.వరలక్ష్మి
మీ కూతుళ్లు: శ్రీమతి పి.ఝాన్సీలక్ష్మి, Deputy Range Officer
శ్రీమతి పి.రాణిరుద్రమ, Deputy Range Officer
కోడలు: కె.మౌనిక, Mandal Panchayat Officer
కుమారుడు: P.M.రాజీవ్‌రెడ్డి, Advocate & Notary Public
మనుమలు, మనుమరాళ్లు: సహస్ర, శ్రీహాన్, అదిత్య, అరునిమ, ప్రతిభరెడ్డి, ప్రజ్ఞారెడ్డి, ప్రజ్ఞాన్‌రెడ్డి
Office Address: Beside Residence of Ex. M.L.A., Asifabad, Near Komurambheem Chowk, Court Chowrasta, Main Road, Asifabad. Cell: 94400 55006, 83280 74182

నమూనా ప్రకటన
బహిరంగ ప్రకటన
విజ్ఞతగల నిర్ణయం. వివాదాలకు అతీతం.

25% డిస్కౌంట్ కలదు
లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. 'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
GST 5% Applicable
వివరాలకు: 80087 09949, 80087 09960
ఆదిలాబాద్: 91214 49286, నిర్మల్: 80087 09961, భైంసా: 80087 09957
మంచిర్యాల: 80087 09946, కుమురంభీం: 91549 92560

(c) eenadu

నువ్వు.. ప్రయోజనం బాగు

వానాకాలం సాగు చేస్తే లాభాలు

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: వానాకాలంలో ఆరుతడి పంటగా నువ్వు సాగు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని నేలలు ఈ పంటకు అనుకూలమని.. దీనిని సాగు చేస్తే తక్కువ నీటితో గిట్టుబాటు ధర పొందవచ్చని వ్యవసాయ అధికారి అంజిత్‌కుమార్ వెల్లడించారు. వర్షాభావం వల్ల ఏ పంటలు సాగు చేయకపోతే త్వరగా వీటిని సాగు చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందే అవకాశముంది. ఇది 90 రోజుల పంట కావడంతో పాటు ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది.

నువ్వు పంట

సస్యరక్షణ చర్యలు ఇలా..

పేనుబంక : పంట వేసిన 25 రోజుల్లో ఈ పురుగు ఆశిస్తుంది. ఇది ఆశించిన చోట ఆకుల నుంచి తేనెలాంటి జిగురు పదార్థం విడుదల కావడం వల్ల ఆ పరిసరాల్లో చీమలు వస్తాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామర పురుగులు, పచ్చదోమ : ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. ఆకులు ముడుచుకుపోయి పాలిపోయి తర్వాత దశలో ఎండిపోతాయి. తెల్లదోమ ఆశిస్తే ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ఈనెలు పొడవుగా కిందకు సాగి ముడుచుకుపోతాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతే రాజు

● వీటితో పాటు ఆకుముడత, కాయతొలిచే పురుగు, కోడు ఈగ, వేరుకుళ్లు, కాండం తెగుళ్లు, ఆకుమచ్చ, వెర్రి, బూడిద తెగులు వచ్చే అవకాశముంది. నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.

● పంట పసుపు రంగులోకి రాగానే కోసి కట్టలుగా కట్టి కిందకు వేలాడదీసి ఉంచాలి. వారం రోజులు ఎండిన తర్వాత నూర్పిడి చేయాలి. గింజలను 8 శాతం వరకు తేమ వచ్చే వరకు ఆరబెట్టి సంచుల్లో నిల్వ చేసుకోవచ్చు.

● **నేలల రకం:** తేలికైన నేలలు శ్రేష్ఠం. నీరు నిలిచే బరువు, క్షార గుణాలు కలిగిన నేలలు పనికి రావు. నేలను 2 నుంచి 4 సార్లు మెత్తగా దున్ని రెండు సార్లు గుంటుకతో చదును చేసుకోవాలి. ఎకరాకు 2.5 కిలోల విత్తనాన్ని వేయాలి.

● **విత్తే పద్ధతి:** వరుసల మధ్య దూరం 30 సెం.మీ, మొక్కల మధ్య 15 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలి.

● **రకాలు:** శ్వేత, హిమ(జేసీఎస్ 9456), రాజేశ్వరి, చందన, గౌరి, జేసీఎస్ 1020 అనుకూలం. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

● **ఎరువులు:** నత్రజని 25 కిలోలు(55 కిలోల యూరియా), భాస్వరం 8 కిలోలు(50 కిలోల సూపర్ ఫాస్పేట్), పొటాష్ 8 కిలోలు(14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేయాలి.

● **నీటి యాజమాన్యం:** విత్తిన వెంటనే పలుచటి తడి ఇవ్వాలి. తేమ ఎక్కువగా ఉండటం వల్ల మొక్కలు శాఖీయోత్పత్తి జరిగి ఆకులు, కొమ్మలు బాగా వర్ధి పూత, కాయ రాలకుండా ఉంటుంది.

● **కలుపు నివారణకు:** పెండిమిథాలిన్ ఎకరాకు ఒక లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వంకాయ.. లాభాలు తెచ్చెనయ్యా

సిరికొండ, న్యూస్‌టుడే: సంప్రదాయ పంటలు సోయా, పత్తితో నష్టాలు రావడంతో కూరగాయల సాగు వైపు మళ్లారు. సిరికొండ మండలం రాంపూర్(బి) గ్రామానికి చెందిన రైతు చెండె బాపూరావు వంకాయ సాగుతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. రెండెకరాల్లో వంకాయ సాగు చేస్తున్న ఆయనకు దిగుబడి ఆశాజనకంగా వస్తోంది. మూడు నెలల కిందట సాగుచేసిన పంటకు మందుల పిచికారీ, కూలీలు, రవాణా, ఇతర ఖర్చులకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ఇప్పటి వరకు పంట విక్రయాల ద్వారా రూ.3లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు బాపూరావు తెలిపారు. రెండు నెలల పాటు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో మరో రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతు బాపూరావు చేనులో వంకాయ పంట

ఆదర్శం

రెండేళ్లుగా వంకాయ సాగు చేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. తక్కువ వ్యవధిలో పంట చేతికొస్తుంది. వారానికి రెండు సార్లు తెంపి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ మార్కెట్‌కు వంకాయలు తీసుకెళ్తున్నారు. ఒక్కోసారి తెంపినప్పుడు 30 బుట్టల వంకాయలను మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతు తెలిపారు. ప్రస్తుతం ఒక్కో బుట్టకు రూ.600 ధర పలుకుతోందని చెప్పారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

డా.పి.సాధ్వి, శాస్త్రవేత్త
బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి
చరవాణి సంఖ్య: 93811 81253

? ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేసుకోవచ్చు? **- రమేష్, బెల్లంపల్లి**

✓ నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేసుకోవచ్చు. నువ్వులు, అలసంద, ఉలవలు, కూరగాయలను సాగు చేసుకోవచ్చు.

? వరిపంటలో ఆకుముడత పురుగు సోకింది. నివారణ ఎలా? **- వెంకటేష్, నెన్నెల**

✓ పురుగు ఉధృతి గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ లేదా ఫ్లుబెండమైడ్ 0.1 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలి. **- న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం**

గొర్రెలకు నీలి నాలుక ముప్పు

మీకు తెలుసా?

వర్షాకాలం కావడంతో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుందని దీని పట్ల పెంపకందారులు జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్యాధికారి డా.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం దోమల బెడద ఎక్కువగా ఉండటం వల్ల వ్యాధికి ఎక్కువగా గురవుతాయని వెల్లడించారు. వ్యాధి సోకిన పది రోజులకు లక్షణాలు బయటపడతాయి. వ్యాధి సోకితే జీవాలు నీరసంగా కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడతాయి. పాకలను శుభ్రంగా ఉంచాలి. పాక దగ్గర నీరు నిలవకుండా చూడాలి. దోమలు, ఇతర కీటకాల బారిన పడకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య వేపాకు లేదా కా బందను కాల్చి మంద లేదా పాక దగ్గర పొగ వేయడం ద్వారా కీటకాల బెడదను తగ్గించవచ్చు. అనారోగ్యానికి గురైన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స చేయించాలి. లేకుంటే మిగతా జీవాలకు వ్యాధి సోకే అవకాశముంటుంది. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

సమావేశం నుంచి బయటకు వస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో భాజపా కౌన్సిలర్లు

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్, భారాస, ఎంఐఎం కౌన్సిలర్లతో పుర ఛైర్‌పర్సన్ బండారి అనూష

ఉత్కంఠ నడుమ కోఆప్షన్ ఎన్నిక మరోసారి వాయిదా

ఫలించిన కూటమి ఎత్తుగడ

ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఉత్కంఠ నడుమ ఆదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ముందుగా అనుకున్నట్లుగా కూటమి నేతలు వేసిన ఎత్తుగడ ఫలించినట్లు తెలుస్తోంది. గుర్రుగా ఉన్న భాజపా నేతలు ఈ విషయంపై కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

స్వతంత్రుల మద్దతుతో సరిపడా సంఖ్యాబలం ఉండటంతో భాజపా మొదటినుంచి తమదే విజయమని నమ్మకంతో ఉంది. ఇటు కూటమిగా ఏర్పడిన కాంగ్రెస్, భారాస, ఎంఐఎంకు చెందిన ముఖ్యనేతలు వాయిదా వేసేందుకు వ్యూహరచన చేస్తూ రావడం.. సమావేశం జరిగేలా భాజపా అధికారులపై ఒత్తిడి తీసుకు రావడంతోనే ఎన్నికకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. చివరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి జోక్యం చేసుకొని అధికారులకు సూచనలిచ్చారనే ప్రచారం రాజకీయపరంగా వేడిపుట్టిచ్చింది.

40 నిమిషాలపాటు రగడ

మున్సిపల్ కార్యాలయంలో సమావేశం సరిగ్గా 3 గంటలకు ప్రారంభమైన వెంటనే కూటమి కౌన్సిలర్లు గళమెత్తారు. అభివృద్ధిపై ధ్యాస ఎందుకు లేదని భూకబ్జాలపై చర్చించాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై ఆరోపణలు సంధించారు. కూటమి కౌన్సిలర్లందరూ పోడియం వద్దకు దూసుకెళ్లడంతో అక్కడ రగడ నెలకొంది. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఛైర్‌పర్సన్ అనూష, పుర కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ వద్ద డిమాండ్ చేశారు. గతంలోనే భాజపా తాత్కాలిక ఛైర్‌పర్సన్‌ను కూర్చోబెట్టి ఎన్నిక చేపట్టాక మళ్లీ ఎన్నిక అని ఎందుకని అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇలా దాదాపు 40 నిమిషాలపాటు సభ్యుల నినాదాలతో దద్దరిల్లింది. చివరకు ఛైర్‌పర్సన్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో భాజపా ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇతర కౌన్సిలర్లు కలిసి తాము బలపర్చిన నలుగురు కోఆప్షన్ సభ్యుల పేర్లతో పుర కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం పుర కార్యాలయ ప్రాంగణంలో కూటమి కౌన్సిలర్లు భూకబ్జాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. భాజపా కూటమి నేతలు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. 51 మంది సభ్యుల్లో సమావేశానికి ఒక కాంగ్రెస్, ఒక ఎంఐఎం కౌన్సిలర్ గైర్హాజరయ్యారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు సునిల్, నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

శాంతిభద్రతల దృష్ట్యా..

ముందుగా అభివృద్ధి, భూకబ్జాపై చర్చించి ఆ తరువాత కోఆప్షన్ ఎన్నిక నిర్వహించాలని తోటి సభ్యులు పట్టుబట్టారు. సమావేశం సజావుగా జరగాలని వారికి సూచించాం. సభ్యులు మాత్రం ప్రజల కోసం కూర్చున్నాం.. తొలుత ప్రజా సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. గందరగోళం నెలకొనడంతో అక్కడ సమావేశం నిర్వహించే వాతావరణం కనిపించ లేదు. అందుకనే శాంతి భద్రతల దృష్ట్యా వాయిదా వేశాం. **- బండారి అనూష, ఛైర్‌పర్సన్**

కుట్ర పూరితంగానే..

సమస్యలను గత సమావేశాల్లో ఎందుకు ప్రస్తావించలేదు. భాజపాకు 27 మంది సంఖ్యాబలం ఉండడంతోనే కుట్రపూరితంగా వాయిదా వేశారు. మూడు పార్టీలు ఒక్కటయ్యాయి. మాజీ మంత్రి జోగురామన్న కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి ఈ తతంగం నడిపించారు. రామన్న పదేళ్ల హయాంలో మున్సిపాల్టీలో జరిగిన అక్రమాలపై కోర్టుకు ఆధారాలు ఇస్తాం. ఎన్నిక వాయిదాపై న్యాయం కోసం కోర్టుకు వీడియో సమర్పిస్తాం. **- ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్**

తూము సాయిలు

ఆవుల గంగాధర్

తులసీరాం

తూము గౌరబాయి

దైవ దర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

కుభీరు, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జీపు ముందు టైరు పేలి వాహనం బోల్తా పడడంతో కుభీరు మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలైన ఘటన మహారాష్ట్రలోని తోటంబ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకొని పార్డి(బి)కి చెందిన పదిమంది కలిసి ఒక జీపులో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సమీపంలోని కైలాస్‌టేక్డి(శివాలయం) దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. అక్కడి నుంచి మహారాష్ట్రలోని సాసర్‌కుండ్ వద్ద ఉన్న శివాలయాన్ని దర్శించుకొని తిరిగి వస్తుండగా.. మహారాష్ట్రలోని తోటంబ సమీపంలో జీపు ముందు టైరు పేలి అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో తూము సాయిలు(60), తూము గౌరబాయి(62), ఆవుల గంగాధర్(61) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు క్షతగాత్రులను భైంసా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వాహన చోదకుడు దాహెగాం తులసీరాం(26) మృతిచెందారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నియంత్రికల దొంగల ముఠా అరెస్టు

250 కేజీల రాగి తీగ, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సాయికిరణ్, పక్కన సీఐలు

భైంసా, న్యూస్‌టుడే : భైంసా డివిజన్‌లో విద్యుత్తు నియంత్రికలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడిన ముఠాను ముథోల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం పట్టణ ఠాణాలో నిందితులను ప్రవేశపెట్టిన ఏఎస్పీ సాయికిరణ్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన షెడికే గణేశ్, గంటల్‌వాడ్ సాయినాథ్(ఎలక్ట్రీషియన్), నక్కల్‌వాడ్ గణేశ్, రత్నెల్లి గజానంద్, ఘూగ్రే దీపక్, భైంసా పట్టణానికి చెందిన పిట్లొల్ల పోశెట్టి(ఎలక్ట్రీషియన్)తోపాటు ఓ మైనర్ బాలుడు జల్సాల కోసం ఎనిమిది నెలలుగా డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేసి అందులోని రాగి తీగలు దొంగలించారు. వీరిపై ముథోల్, తానూరు, కుభీరు, బాసర, కుంటాల, భైంసా పట్టణం, గ్రామీణ ఠాణాల్లో 33కేసులు నమోదయ్యాయి. ఎస్పీ డా.జి.జానకి షర్మిల నేతృత్వంలో నియంత్రికల దొంగలను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ముథోల్ పోలీసులు ఏడుగురిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకొన్నారు. వారి నుంచి 250కేజీల రాగి తీగలు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఏడు చరవాణులు, దొంగతనాలు వినియోగించిన కటింగ్ ప్లేయర్, దబ్బనం ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ముథోల్, బాసర సీఐలు రవీందర్ నాయక్, దీపక్, ముథోల్, తానూరు ఎస్సైలు బి.పెర్సిస్, షేక్ జుబేర్, ఏఎస్సై నర్సింగ్ భాను, సిబ్బంది రాజేందర్, అమర్‌నాథ్, పోతన్న, గజేందర్, వెంకటసాయి, నరేంద్రచారి, గగన్, సందీప్, వెంకట్‌రావును ఏఎస్పీ అభినందించారు.

అటవీ ప్రాంతంలో విరివిగా పెరిగిన పుట్ట గొడుగులు

సహ్యాద్రిపై 'సహజ' పుట్ట గొడుగులు

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఎక్కువ పోషకాలుండే పుట్టగొడుగులు తినడానికి చాలా మంది ఇష్టపడుతుంటారు. నిర్మల్-ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుగా ఉన్న సహ్యాద్రి పర్వతాలపై ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా పెరిగిన పుట్టగొడుగులు లభ్యమయ్యాయి. సోమవారం క్షేత్ర పర్యటనకు వెళ్లిన సారంగాపూర్ ఉప అటవీ క్షేత్రాధికారి మహ్మద్ నజీర్‌ఖాన్ వాటిని గుర్తించారు. రొయ్య, కోడికూర, చీమ, తెల్ల, చెదల పుట్ట గొడుగులుగా స్థానికంగా వీటిని పిలుస్తుంటారు. టెర్మిటోమైసెస్ మైక్రోకార్పస్ శాస్త్రీయ నామం కలిగిన లయోఫిల్లాసియో కుటుంబానికి చెందిన ఇవి ఆకురాల్చే అడవులు, వెదురు మొదళ్లల్లో వద్ద పెరుగుతుంటాయని ఆయన తెలిపారు.

ఎస్టీపీపీ వో అండ్ ఎం నిర్వహణపై గందరగోళం!

సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం

జైపూర్, న్యూస్‌టుడే: జైపూర్ మండలం పెగడపల్లి సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం వోఅండ్‌ఎం(ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్) బాధ్యతలపై ఉత్కంఠ నెలకొనగా కార్మిక వర్గం గందరగోళానికి గురవుతోంది. ఎస్టీపీపీలో 600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్ల వోఅండ్‌ఎం బాధ్యతలను 2021 జూన్‌లో పవర్‌మేక్ సంస్థ 7 సంవత్సరాలకు (రెండేళ్ల ఎక్స్‌టెన్షన్ కలుపుకొని) దక్కించుకోగా.. ఈఏడాది మేలో 5ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం అన్ని ఖర్చులు కలుపుకొని ప్రతి నెలా పవర్‌మేక్ సంస్థకు నిర్వహణ కింద సింగరేణి యాజమాన్యం రూ.7కోట్ల పైచిలుకు చెల్లిస్తోంది. మరో రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ ఇంతకంటే తక్కువ ధరకు వోఅండ్‌ఎం బాధ్యతలు చేపట్టేందుకు ఇతర సంస్థలు ఆసక్తి చూపుతాయనే కోణంలో యాజమాన్యం కొన్నినెలల కిందట టెండర్లు పిలిచింది. కొన్ని సంస్థలు పోటీ పడగా ఇటీవల విడుదల చేసిన టెండర్‌లోనూ ఎల్-1గా పవర్‌మేక్ సంస్థ నిలిచింది. ప్రస్తుతం చెల్లించే ధర కంటే నూతన టెండర్ ద్వారా ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి రావడంతో యాజమాన్యం ఆలోచనలో పడినట్లు సమాచారం. మూడు నెలల పొడిగింపుతో సోమవారం(ఆగస్టు 31) వరకే పవర్‌మేక్ నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. సోమవారం కార్మికుల గేట్ పాస్‌ల గడువు పూర్తికావడంతో గందరగోళం నెలకొంది. టెండర్ గురించి సోమవారం సాయంత్రం వరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేకపోగా.. కొన్ని కార్మిక సంఘాలకు వారం వరకు పాస్‌ల గడువు పొడిగించాలని మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. పాస్‌ల విషయంలో ఆందోళన చెందకుండా పాతవాటితోనే విధులకు హాజరు కావాలని పలు కార్మిక సంఘాలు సామాజిక మాధ్యమాల ద్వారా విషయాన్ని తెలియజేశాయి. ఈ విషయమై ఎస్టీపీపీ ఈడీ చిరంజీవిని వివరణ కోరగా... నిర్వహణ బాధ్యతలను పవర్‌మేక్ సంస్థకే అప్పగించామని, ప్రక్రియ రెండు వారాల కిందటే పూర్తయిందని చెప్పారు. గేట్‌పాస్‌ల విషయంలో కార్మికులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

మారథాన్‌లో ఇందారం యువకుల ప్రతిభ

మారథాన్‌లో ప్రతిభ చూపిన అరికె సంతోష్, సంకటి సంతోష్

జైపూర్, న్యూస్‌టుడే : హైదరాబాద్ రన్నర్స్, ఎన్ఎండీసీ సంయుక్తంగా ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో నిర్వహించిన మారథాన్-15వ ఎడిషన్‌లో ఇందారం యువకులు ప్రతిభ కనబరిచారు. 42.95 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో సంకటి సంతోష్, 21.95 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్‌లో అరికె సంతోష్ ప్రతిభ చూపారు. కాగా వీరిద్దరు గతంలోనూ పలు మారథాన్‌లో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు.

మంచిర్యాలలో కేంద్రీకృత వంటశాల ప్రారంభం

విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్రీకృత వంటశాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్, సింగరేణి భాగస్వామ్యంతో ఏర్పాటైన వంటశాలలో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలకు చెందిన 49,109 మంది విద్యార్థులకు రోజూ రుచికరమైన, పరిశుభ్రమైన అల్పాహారం ఆరంభమైంది. ఈ తయారీ విధానాన్ని ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, సింగరేణి అధికారులు పర్యవేక్షించారు. అనంతరం పద్మనాయక కల్యాణ మండపంలో విద్యార్థులతో అతిథులు అల్పాహారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏ విద్యార్థి అర్ధాకలితో బడికి వెళ్లకూడదనేది ప్రజా ప్రభుత్వం సంకల్పమన్నారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, సింగరేణి అధికారులు రాధాకృష్ణ, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఛారిటబుల్ ప్రతినిధులు సత్య గౌరచంద్ర దాస, కాంతేయ దాస, నగర మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, తదితరులున్నారు.

EENADU e Classifieds

PERSONAL CLASSIFIEDS

మంచిర్యాలలో త్వరలో ప్రారంభం కాబోతున్న షాపింగ్‌మాల్‌లో పని చేయుటకు సేల్స్‌బాయ్స్ మరియు సేల్స్ గర్ల్స్ కావలెను. Cell: 83090 34069.

CHANGE OF NAME

I, Nutula PetaRamreddy S/o. Nutula Bhojareddy (Oldname) R/o. H.No.3-77, Vill: Madhapur, Mdl: Soan, Dist. Nirmal. TS havechanged myname as Nutula Ramreddy S/o. Nuthula Bhoja Reddy (New name).

రాఘవ అసెట్ ఫైనాన్స్ ప్రై.లి.లో చేయుటకు అభ్యర్థులు కావలెను. బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్-11, జీ: 16K-18K. & షోరూం ఎగ్జిక్యూటివ్స్-03, జీ: 15 K. Locations: ఆదిలాబాద్, నిర్మల్, లక్షెట్టిపేట్, మంచిర్యాల, కాగజ్‌నగర్. Cont. 7337551744/705

REAL ESTATE

బ్యాంక్ సీజ్ చేసిన ఓపెన్ ప్లాట్స్ మరియు ఇండివిడ్యువల్ హౌసెస్ అమ్మకానికి కలవు. ఆసక్తి కలవారు సంప్ర॥ 8886068456 (శ్యామ్).

శ్రీరామ్ అకాడమీకి ఇంటి వద్ద నుండి ప్రాజెక్టు వర్క్ చేయుటకు ఫోన్ ఉన్న వారు కావలెను. అ:10th, జీ:20k శిక్షణ రుసుము కలదు. సెల్: 8886977750.

JOBS

Staff Required For CCTV Cameras Installation & Servicing in Mancherial. Lorven I Zone CCTV Cameras. 94404 84878.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad:
80087 09949
90005 66042

అమర వీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న వీర తెలంగాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, సభ్యులు

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుందాం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఆదివాసీ అమర వీరుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్తామని వీర తెలంగాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. సోమవారం ఇంద్రవెల్లిలో అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి, జాగో తెలంగాణ యాత్రకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడుకుందామన్నారు. కుల, మత, రాజకీయాలను వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువత, మహిళలు, రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలను రాజకీయాల్లోకి ఆహ్వానించడమే లక్ష్యమన్నారు. ఇంద్రవెల్లి నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల కిలోమీటర్ల వరకు కొనసాగుతుందన్నారు. పల్లెల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటామని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ముగింపు పలుకుతామన్నారు. అనంతరం కేస్లాపూర్ గ్రామానికి వెళ్లి ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజన, వివేక్, అమూల్య, సుమన్, సతీష్, దిలీప్, గురువయ్య, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఈఓలుగా పదోన్నతి

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మందికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)లుగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం డిప్యూటీ సీఈఓ హోదాలో ఉన్న వీరికి ఇక సీఈఓగా హోదా కల్పించనున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న ఆర్.లక్ష్మీనారాయణ, ఆదిలాబాద్ గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ)గా పనిచేస్తున్న రవీందర్‌రాథోడ్ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

తొలి మావోయిస్టు మహిళా నేత కన్నుమూత

రాధక్క

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఎదులాపురం: తెలంగాణ తొలి మావోయిస్టు ఆదివాసీ మహిళ, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న సతీమణి కుర్సెంగ్ మోతీబాయి అలియాస్ రాధక్క(55) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మూడురోజుల కిందట ఆదిలాబాద్ రిమ్స్‌లో చేరిన ఆమె సోమవారం సాయంత్రం గుండెపోటుతో తుదిశ్వాస వదిలారు. ఆమె స్వస్థలం ఆదిలాబాద్ గ్రామీణ మండలం పిప్పల్‌ధరి. బాల్యం నుంచే ఆదివాసీ హక్కుల కోసం నినదించిన ఆమె 1984లో పీపుల్స్‌వార్‌లో చేరారు. దళసభ్యురాలి నుంచి రాష్ట్ర కమిటీ బాధ్యతల నిర్వహణ వరకు ఆమె ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. విప్లవోద్యమ కార్యకలాపాలు, కార్యక్రమాల అవసరాలరీత్యా పార్టీ ఆమెను 1998లో ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేసింది. అక్కడ ఆదివాసీలను సంఘటితం చేయటంలో చురుకైన పాత్ర పోషించారు. 2017లో అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి వెళ్తుండగా ఆమె ప్రయాణిస్తున్న వాహనం ఖమ్మం దగ్గర వెంటాడుతున్న పోలీసులను తప్పించే క్రమంలో బోల్తాపడింది. గాయాలతో బయటపడి పోలీసులకు పట్టుబడిన ఆమె నాలుగేళ్లపాటు జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత ఆమెపై ఉన్న కేసులను కోర్టు కొట్టివేసింది. గతేడాది నవంబరులో చంద్రన్న ఉద్యమం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఇద్దరు కలిసి రామగుండంలో ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పిప్పల్‌ధరికి వచ్చిన ఆమె మూడురోజుల కిందట రిమ్స్‌లో చేరారు. మంగళవారం మధ్యాహ్నం లింగుగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతిపై ప్రజాసంఘాల బాధ్యులు, వామపక్షవాదులు నివాళులర్పించారు.

గ్రామీణుల సేవల్లో ఐపీపీబీ

న్యూస్‌టుడే, భుక్తాపూర్:

పోటీ ప్రపంచంలో అన్ని బ్యాంకులకు దీటుగా మెరుగైన సేవలు అందించాలని భారత ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో 2018లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ)ను ప్రారంభించింది. బ్యాంకులు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల వారికి సులభంగా బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది. దేశంలోని ప్రముఖ కంపెనీలతో కలిసి ప్రమాద బీమా పాలసీలను ప్రవేశపెట్టింది. మంగళవారం తొమ్మిదో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా కథనం.

- జీరో బ్యాలెన్స్‌తో ఖాతా తెరవవచ్చు.
- బ్యాంకులో గరిష్ఠంగా రూ.2లక్షల వరకు బ్యాలెన్స్ ఉంచుకోవచ్చు.
- ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా సులభంగా డబ్బులు పంపవచ్చు.
- ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా కరెంటు, గ్యాస్, డీటీహెచ్, రీఛార్జ్‌లు చేసుకోవచ్చు.
- గ్యాస్ రాయితీ, పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాల డబ్బులు నేరుగా ఐపీపీబీ ఖాతాలో జమ అవుతుంది.

ఉమ్మడి జిల్లాలో వివరాలు

- ఐపీపీబీ ఖాతాలు : 6 లక్షలు
- ప్రమాద బీమా పాలసీలు : 50 వేలు
- ప్రమాద బీమా పాలసీ క్లెయిమ్‌లు : రూ.2 కోట్లు
- బాల ఆధార్ నమోదు : 10 వేలు
- ఆధార్ మొబైల్ నవీకరణ : 20 వేలు

తరోడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ రూ.549తో ఆదిత్య బిర్లా ప్రమాద బీమా పాలసీ చేసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు బోల్తా పడి ఆయన మరణించారు. నామినీగా ఆయన భార్య భూమిబాయికి రూ.10 లక్షలు చెక్కును కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ఐపీపీబీ తపాలా సిబ్బంది, ఆదిత్య బిర్లా సిబ్బంది అందించారు.

అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో మనోళ్లకు కాంస్యం

కాంస్య పతకం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు క్రీడాకారులు

రెబ్బెన, న్యూస్‌టుడే: మెదక్ జిల్లాలో గత నెల 28-30 వరకు జరిగిన అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు కాంస్య పతకం సాధించింది. సెమీ ఫైనల్‌లో వరంగల్ జట్టుపై 35-33, 35-32 పాయింట్ల తేడాతో ఓడింది. మూడో స్థానంలో నిజామాబాద్ జట్టుపై 35-25, 35-28 స్కోర్ చేసి గెలుపొంది కాంస్య పతకాన్ని సాధించినట్లు ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతిలు తెలిపారు. పురుషుల జట్టు హైదరాబాద్‌పై ఓటమి పాలై నాలుగో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పతకాన్ని సాధించిన జిల్లా జట్టును జిల్లా ఒలింపిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లు మహేందర్, భాస్కర్, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు అభినందించారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆసిఫాబాద్: 80085 73640 కాగజ్‌నగర్: 83418 12400
కౌటాల: 94401 00066 రెబ్బెన: 80085 73643

? వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో విద్యుత్తు దీపాలు లేవు. రాత్రివేళల్లో ఆసుపత్రికి వచ్చే వారికి ఇబ్బందిగా మారింది. - **దీపక్, వాంకిడి. వాంకిడి, న్యూస్‌టుడే**

✔ వీధి దీపాలు అమర్చేలా చర్యలు తీసుకుంటాం.
- **శివకుమార్, గ్రామ కార్యదర్శి, వాంకిడి**

పాముకాటుతో వృద్ధుడి మృతి

బెజ్జూరు, న్యూస్‌టుడే : బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి చెందిన పొర్తెటి బాపు(70) అనే వృద్ధుడు పాముకాటుతో మృతి చెందినట్లు ఏఎస్సై మోహన్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఎద్దు మేత కోసం తన పెరట్లో ఉన్న వరి గడ్డిని తీస్తున్న క్రమంలో వృద్ధుడి చేతిపై పాము కాటేసింది. తీవ్ర రక్తస్రావం కావడంతో.. వెంటనే కుటుంబీకులు బెజ్జూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

బాపు

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన బస్సు.. యువకుడి దుర్మరణం

రెబ్బెన, న్యూస్‌టుడే: నవేగాం బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యారు. ఎస్సై ఎ.వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామానికి చెందిన వడై మునేశ్వర్(28) ద్విచక్రవాహనంపై సోమవారం రాత్రి కాగజ్‌నగర్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సు బెజ్జూరు వైపు వెళ్తోంది. నవేగాం గ్రామ శివారులోకి చేరుకోగానే ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టింది. మునేశ్వర్ అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలానికి చెందిన డ్రైవర్ ఎండీ ఖాన్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య జీవన్‌బాయి, కుమార్తె, కుమారులున్నారు.

మునేశ్వర్

ఒకరిపై కేసు నమోదు

కౌటాల, న్యూస్‌టుడే : కౌటాల మండలంలోని వీర్దండి గ్రామానికి చెందిన జాడె నానాజీపై మంత్రాల నెపంతో భయభ్రాంతులకు గురిచేసిన మహారాష్ట్రకు చెందిన కోవె గణపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుమారుడిపై అదే గ్రామానికి చెందిన నానాజీ మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో మహారాష్ట్రలోని గజ్జోలి గ్రామానికి చెందిన పూజారి కోవె గణపతిని ఆశ్రయించాడు. ఇటీవల పూజారి గణపతితో కలిసి సదరు వ్యక్తి నానాజీ ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి కోవె గణపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

యువకుడి పై పోక్సో...

బెజ్జూరు, న్యూస్‌టుడే : బెజ్జూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రేమ పేరుతో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినందుకు యువకుడిపై పోక్సో కేసునమోదు చేసి సోమవారం రిమాండుకు పంపినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ తెలిపారు. ఓ గ్రామానికి చెందిన రౌతు మహేష్‌పై బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన వివరించారు. పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: మండలంలోని వెంకట్రావ్‌పేట్ క్రాస్ రోడ్డు వద్ద నాలుగు పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో నాలుగు పశువులకు తగినంత నీరు, ఆహారం లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించామని ఎస్సై సాగర్ తెలిపారు. మహమ్మద్ కైఫ్, అబ్దుల్ కరీంకుర్షి, ఖాజా యాకోబుద్దీన్‌లు మహారాష్ట్రలోని పోడ్సా పరిసర గ్రామాల నుంచి కొనుగోలు చేసి కాగజ్‌నగర్‌కు తరలిస్తున్నట్లు వెల్లడైందన్నారు. పశువులతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ పేర్కొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

బెజ్జూరు, న్యూస్‌టుడే : బెజ్జూరు మండలం మర్థిడి శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు చేపట్టారు. ముందస్తు సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ విష్ణు, కానిస్టేబుళ్లు మల్లేష్, మహేందర్‌లు.. స్థలానికి చేరుకుని రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, రూ.1000 స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కొందరు పరారయ్యారని తెలిపారు.

ఆర్ఎంపీ ఇంటి ఎదుట ఆందోళన

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని బొగుడగూడ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యురాలు ఇచ్చిన చికిత్స వికటించడంతోనే మర్థిడికి చెందిన తాళ్ల సాలుబాయి మృతి చెందిందని ఆరోపిస్తూ.. కుమారులు దాసు, రాకేష్, కుటుంబ సభ్యులు సోమవారం సదరు వైద్యురాలి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలుబాయికి రెండు రోజుల కిందట విరేచనాలు కావడంతో ఆర్ఎంపీ వైద్యురాలు నిహారిక వద్దకు వెళ్లారు. సెలైన్ పెట్టగా చేతివద్ద ఎర్రగా అయి తిమ్మిరి వస్తున్నట్లు ఆమె పేర్కొన్నది. కొద్దిసేపటికే మృతి చెందిందని ఆరోపించారు. అనంతరం ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

నామినేషన్ల ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పీఏసీఎస్‌ల పాలకవర్గాలను నామినేషన్ విధానంలో నియమించాలనే ప్రభుత్వ ఆలోచన మానుకొని ఎన్నికలు నిర్వహించాలని జిల్లాలోని పీఏసీఎస్‌ల ఛైర్మన్‌లు డిమాండ్ చేశారు. తమ నివేదికను ప్రభుత్వానికి విన్నవించాలని కోరుతూ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందించారు. పీఏసీఎస్‌ల పదవీ కాలం ముగిసి ఏడాది కావస్తున్నా.. ఇప్పటికీ రెండు సార్లు గడువు పొడిగించారన్నారు. పీఏసీఎస్‌ల ఛైర్మన్‌లు అలీబిన్ అహ్మద్, పెంటయ్య, శ్రీనివాస్, ఆశన్న, శంకర్, తిరుపతి తదితరులున్నారు.

కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న పీఏసీఎస్‌ల ఛైర్మన్‌లు, రైతులు

మూల్యాంకన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సిందే

ఆసిఫాబాద్ రూరల్, న్యూస్‌టుడే: పాఠశాల విద్యలో ఎస్ఏ 1,2 పరీక్షలకు బాహ్య మూల్యాంకనాన్ని ప్రవేశపెడుతూ విద్యాశాఖ డైరెక్టరేట్ జారీ చేసిన ఏకపక్ష ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముడిమడుగుల తిరుపతి, చునార్‌కార్ తుకారాం అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిత్యం బోధించే ఉపాధ్యాయుడికే విద్యార్థి బలాలు, బలహీనతలపై అవగాహన ఉంటుందని, సొంత టీచర్లని కాదని బయటివారితో మూల్యాంకనం చేయించడం సరికాదన్నారు.

సన్మానించి.. అభినందనలు తెలిపి

బెజ్జూరు, న్యూస్‌టుడే : కుంటలమానేపల్లి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన తలండి చంద్రయ్యకు.. సోమవారం ప్రధానోపాధ్యాయుడు పరశురాం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరకానికి నకలుగా వేంపల్లి రహదారి

సిర్పూర్ నుంచి కాగజ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి ప్రయాణికుల పాలిట నరకప్రాయంగా మారింది. మండల పరిధిలోని వేంపల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి సమీపంలో రోడ్డు తీవ్రంగా ధ్వంసమై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవలి వర్షాలకు వాటిల్లో నీరు చేరి ఉండటంతో.. వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఆందోళన చెందుతున్నారు. కాగా ఇటీవల ఎమ్మెల్యే హరీశ్‌బాబు గుంతలను పూడ్చాలని ఆదేశించిన నేపథ్యంలో.. అచ్చెల్లి సర్పంచి రజనీ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. కానీ భారీ వాహనాల రాకపోకలతో మళ్లీ యథావిధిగా మారిపోయింది. అధికారులు స్పందించి తారు రోడ్డు వేయాలని కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, సిర్పూర్(టి)**

తీగలే ఆధారం.. పడితే ప్రమాదం

ఆసిఫాబాద్ మండలంలోని సాలెగూడ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న పంట పొలాల్లో విద్యుత్తు లైన్లు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా వాంకిడి వైపు వెళుతున్న లైన్‌లో ఉన్న ఓ స్తంభం ఒకవైపునకు వంగి తీగల సహాయంతో ఆధారపడి ఉంది. గాలులు వీచిన క్రమంలో ఎప్పుడు కూలిపోతుందోననే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ స్తంభం సమీపంలో రైతులు భయం భయంగా తిరుగుతున్నారు. స్తంభం కూలిపోకముందే ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరిచేయాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ రూరల్**

తరలివచ్చి.. దరఖాస్తులు అందించి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి స్పందన వచ్చింది. వివిధ మండలాల నుంచి సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి.. అదనపు కలెక్టర్లు యువరాజ్, డేవిడ్, డీఆర్వో వేణులతో కలిసి కలెక్టర్ హరిత వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 49 మంది తమ సమస్యలపై విన్నవించారు.

దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత, చిత్రంలో అదనపు కలెక్టర్లు యువరాజ్, డేవిడ్, డీఆర్వో వేణు

రేషన్ కార్డు మంజూరుకు

- హరికాంత్

మాది వాంకిడి మండలం గాట్‌జనగామ. తల్లిదండ్రుల రేషన్ కార్డు నుంచి పేరు తొలగించి కొత్త కార్డు కోసం జనవరిలో దరఖాస్తు చేశా. ఇప్పటి వరకు కార్డు రాలేదు. దీంతో బియ్యం రాకుండా పోయి నష్టపోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కొత్త కార్డు మంజూరు చేయాలి.

అటవీ అధికారుల అడ్డగింత

- మడావి ముత్త, ఆత్రం సుపారి, పోత, భీము

మాది వాంకిడి మండలం గోందాపూర్. గతేడాది కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ పత్రాలను జారీ చేశారు. గుడిసెల్లో ఉంటున్న ఇళ్లను కూల్చివేసి కొత్తగా నిర్మించుకుందామంటే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారు. రెవెన్యూ స్థలం కాదని, నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారు.

పింఛన్ పునరుద్ధరణ కోసం

- ప్రశాంత్‌రాయి

కాగజ్‌నగర్ మండలం బసంతినగర్‌కు చెందిన ప్రశాంత్‌రాయి చెవిటితనంతో బాధపడుతున్నాడు. 2022 మే 10న 69 శాతంతో నాలుగేళ్ల కాలపరిమితితో సదరం ధ్రువపత్రం జారీ చేశారు. గడువు తీరడంతో పింఛన్ నిలిచిపోయింది. మళ్లీ దరఖాస్తు చేద్దామంటే అనుమతించడం లేదని, అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

జలపాతం నిర్వహణ బాధ్యతలపై

- మందగూడ గ్రామస్థులు

మాది తిర్యాణి మండలం మందగూడ. చింతలమాదర జలపాతం నిర్వహణ కోసం 2022 జులైలో అటవీ శాఖ, 15 మంది గ్రామస్థుల భాగస్వామ్యంతో ఈకో టూరిజం డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. వచ్చిన ఆదాయం నుంచి 50 శాతం జలపాతం వద్ద అభివృద్ధి పనులు, మిగతావి పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తామని నిర్ణయించారు. తరువాత అటవీ అధికారులు తామే నిర్వహిస్తామని ఆదాయం ఇవ్వడం లేదు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల నిర్వహణ లేక జలపాత ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. పెసా చట్టం ప్రకారం నిర్వహణ బాధ్యతను పంచాయతీ ప్రజలకు అప్పగించాలని తీర్మానం చేసినట్లు గ్రామ యువకులు వినోద్‌కుమార్, కృష్ణ, గోవర్ధన్, వెంకటేశ్, కైలాస్, సంతోష్ తదితరులు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూనే సమస్యలను పరిష్కరించనున్నట్లు జీఎం ఎం.శ్రీరమేష్ తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులు, ఏఐటీయూసీ మధ్య నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి.. ఏరియాలోని పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకొచ్చారు. తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి, జీఎం కమిటీ సభ్యులు శేషశయనరావు, జూపాక రాజేష్, బి.జగ్గయ్య, మారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన జీఎం శ్రీరమేష్

అన్నాభావు సాఠే సేవలు చిరస్మరణీయం

కెరమెరి, న్యూస్‌టుడే : సామాజిక న్యాయం, దళితుల కోసం అన్నాభావు సాఠే చేసిన సేవలు మరవలేనివని నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆయన జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్, సర్పంచి పెందూర్ ఆనంద్‌రావు, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రాంచందర్, నాయకులు శ్రీకాంత్, రిజ్వాన్, రాజన్న వినేష్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలకు వినతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: మండలంలోని కోసిని గ్రామ శివారు సర్వే నం. 79, 80లలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు లెండుగురె శ్యాంరావు కోరారు. సోమవారం ఎంపీడీఓ ఉజ్వల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్లలోని భూమిని కబ్జా చేశారని, కలెక్టర్ సర్వే చేసి హద్దులు గుర్తించి జప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.

నక్షాలు లేని గ్రామాల్లో రీసర్వే

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో నక్షాలు లేని గ్రామాల్లో రీ సర్వే వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. భవిష్యత్తులో రైతుల మధ్య గొడవలు, వివాదాలు లేకుండా ఉండేలా సర్వే చేయాలని ఆదేశించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సహకారం తీసుకొని వేగంగా చేపట్టాలని స్పష్టం చేశారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యలపై నిలదీత

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆయా వార్డుల్లో సమస్యలు పేరుకుపోయాయని, అధికారుల నిర్లక్ష్యంతో పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఛైర్‌పర్సన్ షాహీన్ సుల్తాన అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యం, ఫాగింగ్ చర్యలు, ఎల్ఈడీ వీధి దీపాలు, తదితర సమస్యలపై చర్చించారు. 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య మాట్లాడుతూ.. వార్డులో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని, మురుగు కాలువలు దుర్గంధంగా మారాయన్నారు. దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేపట్టాలని, విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలతో కూడిన చిత్రాలను ప్రదర్శించారు. 17వ వార్డులో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని, వీధిదీపాలు, దోమల నివారణ, వీధి కుక్కల బెడద తీర్చాలని కౌన్సిలర్ కావేటి విజయ్ సమావేశం దృష్టికి తెచ్చారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రశ్నిస్తున్న 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య

సదయ్యకు ఆత్మీయ వీడ్కోలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో కర్మచారిగా 40ఏళ్లుగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన డేంగ్రె సదయ్యకు.. సోమవారం పాఠశాల ప్రబంధకారిణి, ఆచార్య బృందం ఆత్మీయ వీడ్కోలునున ఏర్పాటు చేశారు. విభాగ్ అకడమిక్ ఇన్‌ఛార్జి పూదరి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రబంధకారణి సభ్యులు గుర్రాల వెంకటేశ్వర్లు, నాగుల శ్రీనివాస్, కల్లూరి సంతోష్, జంజిరాల శ్రీనివాస్, శ్రీరామ్ సత్యనారాయణ, రమాదేవి, తిరుమల్‌రావు, వైష్ణవి, స్వాతి, జయగౌరి, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే గుర్తింపు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఆర్ఎస్సైలు అంబారావు, మహ్మద్ ముభాషిర్ అహ్మద్‌లకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఐ అడ్మిన్ వామనమూర్తి, జైనూర్ సీఐ రమేష్, ఆర్ఎస్సై జాఫర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో వారసత్వ ఉద్యోగాలు కల్పించాలి

ఆసిఫాబాద్ రూరల్, న్యూస్‌టుడే: తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల డైలీ వేజ్, పొరుగు సేవల కార్మికుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో.. గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీకి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా జాయింట్ కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ కొంత మంది కార్మికులకు వయసు పైబడటం, అనారోగ్య సమస్యల కారణంగా విధులు నిర్వహించలేని పరిస్థితి ఉందని, మానవతా దృక్పథంతో వారి కుటుంబ సభ్యులను నియమించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాంకిడి, న్యూస్‌టుడే: జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో సోమవారం మండలంలోని సోనాపూర్, చిచ్‌పెల్లి గ్రామాల్లో అధికారులు వైద్య శిబిరాలు నిర్వహించారు. 41 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న ముగ్గురి నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం సునంద, ఆశ కార్యకర్త కిష్టుబాయి తదితరులున్నారు.

కాగజ్‌నగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బోడపల్లిలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచి కల్లెపల్లి రాజన్న, వైద్యులు శేషగిరిరావు, అశ్విన్, రావుజీ, సునిత, సంఘ ప్రతినిధులు గణపురం ప్రకాష్, పాలెపు మురళీధర్, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారికి సన్మానం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: గోలేటి ఉపరితల గని ప్రాజెక్టు అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎన్.ఉమాకాంత్‌ను అధికారులు సన్మానించారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను జీఎం శ్రీరమేష్ శాలువాతో సన్మానించి బహుమతి అందజేశారు. ఖైరిగూర ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఇన్‌ఛార్జి ఎస్ఓటు జీఎం స్వామిరాజు, ఏరియా ఇంజినీర్ వీరన్న, డీజీఎం(ఐఈ) డా.ఉజ్వల్‌కుమార్ బెహరా, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు, ఫారెస్టు అధికారి సుష్మ, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, వర్క్‌షాప్ ఎస్ఈ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతానికి పిలుపు

జైనూర్, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూటీఎస్ సంఘం ఉపాధ్యాయులు తరలివచ్చి హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని.. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు తులసీరాం, కార్యదర్శి రాథోడ్ మహేందర్, సిర్పూర్(యు) మండల అధ్యక్షుడు భూమన్న, తదితరులున్నారు.

వృత్తి, యూనియన్‌కు అందించిన సేవలు ఎనలేనివి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న మెరుగు రమేష్ ఉద్యోగ వృత్తికి, యూనియన్‌కు అందించిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గోలేటి సీహెచ్‌పీలో ఎంవీ డ్రైవర్‌గా పనిచేసే రమేష్‌కు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి బహుమతి అందజేశారు. తెబొగకాసం ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, కార్యదర్శులు మారిన వెంకటేశ్వర్లు, ఓరం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాలేదు. నాలుగు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

చింతలమానెపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారి

జైనూర్ : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో భగీరథ పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు.. గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కనక యాదవరావు, సర్పంచులు కొడప ప్రకాష్, మడావి నాగోరావులు దరఖాస్తు అందించారు.

కెరమెరి: ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో.. వివిధ సమస్యలపై 33 అర్జీలు వచ్చాయని ఎంపీడీవో అఫ్జుద్ పాషా తెలిపారు. అటవీ హక్కుకు సంబంధించినవి 23, అంగన్‌వాడీ భవనం కోసం 1, ఇందిరమ్మ ఇళ్ల కోసం 8, రెవెన్యూకు సంబంధించి ఒకటి వచ్చిందన్నారు.

సిర్పూర్(టి): ఎంపీడీఓ కార్యాలయంలో 9 మంది అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలపై 6 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కోట ప్రసాద్ స్వీకరించారు.

వాంకిడి: వాంకిడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో పాటిల్‌జ్యోత్స్న ఆధ్వర్యంలో.. ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరవైంది. సమస్యల పరిష్కారం కోసం మండలంలోని బంబార, ఇంధాని గ్రామ పంచాయతీల నుంచి కేవలం నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ యువరాజ్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగనియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సిర్పూర్(టి) మండలం వెంకట్రావ్‌పేట వద్ద అంతర్రాష్ట్ర వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా చూడాలన్నారు. జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు, వేగ నియంత్రణ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. రోడ్లపై జీవాలు సంచరించకుండా చూడాలన్నారు. ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, కిష్టయ్య, డీఎస్పీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

● అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ ఏడాది మూడు గంజాయి విక్రయ, వినియోగ కేసులు నమోదైనట్లు తెలిపారు. సాగు చేసిన 36 మంది రైతులకు రైతుబంధు నిలిపి వేశామన్నారు. దీనిపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

అంబులెన్స్ సదుపాయం లేక ఇక్కట్లు

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని గిన్నెధరి పీహెచ్‌సీకి అంబులెన్స్ మంజూరు చేయాలని కోరుతూ.. గిన్నెధరి, ఖైరిగూడ గ్రామాల సర్పంచులు వెడ్మ నరేష్, రేణుకలు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వాహన సదుపాయం లేక వివిధ గ్రామాల నుంచి గర్భిణులు, బాలింతలు, ప్రసూతి అయిన వారు ఇబ్బందులు పడుతున్నారు. జడ్పీ రోడ్డు నుంచి గిన్నెధరి వైద్యశాల వరకు నూతనంగా విద్యుత్తు స్తంభాలు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

సమన్వయంతో మండల అభివృద్ధికి కృషిచేద్దాం

జైనూర్, న్యూస్‌టుడే : అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అనిల్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథ్‌రావులు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ముందుగా అధికారులు పంచాయతీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల జాబితాను చదివి వినిపించారు. అనంతరం సర్పంచులు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, ఎంఈఓ కుడ్మేత సుధాకర్, ఏఓ ఆనంద్‌రావు, సిర్పూర్(యు) మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, తదితరులున్నారు.

మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అనిల్‌కుమార్

విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : అటవీ ప్రాంతాల్లో విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు ముందస్తు అటవీశాఖ అనుమతి పొందాలని డీఎఫ్‌వో బాలామణి అన్నారు. సోమవారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఎస్ఈ ఉత్తమ్ జాడె, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో భార్గవ్ కుమార్‌లతో కలిసి అటవీ, విద్యుత్తు సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండా విద్యుత్తు లైన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటి అనుమతులకు తగిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. విద్యుత్తు లైన్‌లతో వన్యప్రాణులకు ఇబ్బందులు, ప్రమాదాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

శివాలయంలో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచే శివలింగానికి అభిషేకం, అలంకరణ, అర్చన తదితర పూజలు నిర్వహించారు. మండలంతోపాటు పట్టణానికి చెందిన భక్తులు తరలివచ్చారు. జిల్లా జడ్జి అనూష-సాయికుమార్ దంపతులు శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

8 నుంచి రైతుకూలీ సంఘం మహాసభలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: మంచిర్యాలలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ రత్నం పోశం కోరారు. సోమవారం పట్టణంలో మహాసభ గోడప్రతులను ఆవిష్కరించారు.

(c) eenadu